ఎంతటి మహావృక్షమైనా పెను తుపానుకి కూలిపోతుంది. ఈ విజయం కేవలం తాత్కాలికమేనని మనసు చెపుతోంది.

"ఏమిటి? వినగానే అలా అయిపోయావు?" నవ్వుతూ అడిగాడు విహారి.

ఆమె తెప్పరిల్లి "నేను నమ్మలేకపోతున్నాను" అంది.

"నమ్మినా నమ్మకపోయినా జరిగిందది--"

"నీకు అర్థం కావటం లేదు విహారీ! స్వామి వూరుకోడు---"

"ఏడిసేడు. ఏం చేస్తాడు? వాడిదీ ప్రాణమే. నాదీ ప్రాణమే. విషయం అంతవరకూ వస్తే అప్పుడు చూసుకుందాం -- నిర్లక్ష్యంగా అన్నాడు.

"చూడు ప్రవల్లికా! మీ యంత్రాంగంలో వచ్చిన చిక్కే ఇది. ప్రతిదానికీ సాక్ష్యాలంటారు, ఆధారాలంటారు. నాకు అలాంటివి అవసరంలేదు కదా -- వాడూ మనిషే. వాడికీ ప్రాణ భయం వుంటుంది. కాస్త భయపెట్టానంతే ..... 'నా జోలికి రాకు' అని చిన్న వార్నింగు - అంతే" అంటూ మళ్ళీ నవ్వేడు.

"కానీ అతడి సంగతి నీకు తెలియటం లేదు విహారీ! ఇంత బలగంతో నేనే ఏమీ చేయలేక పోయాను. అతడెంత నరరూప రాక్షసుడో నాకు తెలుసు. నేను కళ్ళారా చూశాను కాబట్టి చెపుతున్నాను. తనకు కావలసిన దాన్ని ఎలాగయినా సాధించగలడు. అతడు ఎన్ని హత్యలు చేసయినా సరే, ఎంత రక్తం పారించయినా సరే ..... ఆ రోజు నేనింకా మర్చిపోలేను ..... !"

"ఏమిటి నువ్వు చూసింది?"

"దేశానికి నియంత కావాలన్న ఆ మత ప్రవక్త ఆలోచన ఇప్పటిది కాదు. దాదాపు పది సంవత్సరాల నుంచీ దీని గురించి బీజం నాటి నీరు పోస్తూనే వున్నాడు. అతడు ఈ మత ప్రచారకుడు కాకముందు కొంతకాలం సైన్యంలో కూడా పనిచేశాడనుకుంటాను. అందుకే అతడికి ఆర్మ్స్ గురించి బాగా తెలుసు. యుద్ధం పూర్తయి నాన్న ఇంటికి వచ్చేశారు. నేనప్పటికి చిన్నపిల్లని, గ్రాడ్యుయేషన్ పూర్తయిందంతే.

ఆ సెలవుల్లో అన్నయ్య పెళ్ళి ఫిక్స్ అయింది.

మరుసటిరోజు పెళ్ళనగా అన్నయ్య, నాన్న రహస్యంగా మాట్లాడుకోవడం నేను విన్నాను. ఏదో మిలిటరీ కుంభకోణాన్ని నాన్న అధారాలతో సహా పట్టుకున్నాడు. దీనికి సాక్ష్యాలున్నాయి. అవి బయటికి యాభైకోట్ల రూపాయలు డీల్ పదికోట్ల లంచంతో చేతులు మారింది.

సరిగ్గా ఆ సమయంలో అనంతానంతస్వామి ఆ గదిలో ప్రవేశించాడు. నేను అంత డబ్బు చూడటం అదే మొదటిసారి. కోటి రూపాయలు ..... కట్టలు నాన్న ముందు పోసి కాళ్ళ దగ్గర కూర్చున్నాడు. ఆ రుజువులూ, డాక్యుమెంట్లూ ఇచ్చెయ్యమన్నాడు. నాన్న కాలితో కొట్టాడు! ఛీ పొమ్మన్నాడు. స్వామికి కోపం రాలేదు. "కోటి రూపాయలు ఇస్తానంటే వద్దన్నావు. అందులో పదోవంతు ఖర్చుపెట్టి నీ దగ్గర్నుంచి ఆ డాక్యుమెంట్లు ఎలా సంపాదిస్తానో చూడు" అని చెప్పిపోయాడు.

మరుసటిరోజు సాయంత్రం జరిగింది ఆ సంఘటన! పెళ్ళి రిసెప్షన్ జరుగుతూ వుండగా ప్రవేశించాడు రామ్‌లాల్. చేతిలో మిషన్ గన్ వుంది. పెళ్ళి హడావుడిలో అతన్నెవరూ పట్టించుకోలేదు. అన్నయ్య వదినలు టేబిల్ దగ్గిర నిలబడి ప్రజెంటేషన్‌లు. అందుకుంటున్నారు. వెనుకనుంచి పై గదుల్లోకి ప్రవేశించాడు కొందరు. అంగుళం కూడా వదలకుండ పరిశోధించారు. వాళ్ళని ముందు చూసింది అమ్మ. వాళ్ళలో ఒకడు నిర్దాక్షిణ్యంగా ఆమెని పొడిచేసేడు పై అంతస్థునుండి క్రిందపడి ఆమె మరణించటంతో మాకు జరుగుతున్నదేమిటో తెలిసింది. నాన్న రివాల్వర్ కోసం పరుగెత్తాడు. కానీ అప్పటికే ఆలస్యం జరిగి పోయింది రామ్‌లాల్ చేతిలో మిషన్‌గన్ నిప్పులు కక్కింది. మొదట మరణించింది అన్నా వదినలు. పసుపు తడి ఆరకుండానే రక్తంలో కూలిపోయారు. ఐస్‌క్రీం తింటున్న పసిపిల్లలు అలాగే ముందుకు కుప్పకూలిపోయారు. అతిధులు ..... ఆడవాళ్ళు ..... మొత్తం మా బంధువర్గాన్నీ, స్నేహితుల్నీ మిగలకుండా చేయటానికే కంకణం కట్టుకున్నట్టు రామ్‌లాల్ చేతిలో మిషన్‌గన్ నిప్పులు కక్కింది. లోపలకు పరుగెత్తటానికి కూడ వ్యవధి లేనంత తొందరగా జరిగిపోయింది ఆ సంఘటన. వాళ్ళు నాన్నని చంపలేదు. ఐస్ కొట్టే  కత్తితో కాళ్ళు నరికేశారు. అది బహుశా స్వామి ఇన్‌స్ట్రక్షన్ కాబోలు. నాన్న రక్తపు మడుగులో కూలిపోయాడు. ఆ దృశ్యం నా కళ్ళముందు ఒక సజీవ శిల్పంలా ఇప్పటికీ కదులుతోంది. కరిగిన ఐస్‌క్రీమ్, పగిలిన కూల్‌డ్రింక్ సీసాల మధ్య ప్రవహించే రక్తపు కాల్వలు కళ్ళకు కట్టినట్టు ఇప్పటికీ కనబడుతున్నాయి.

డాక్యుమెంట్‌లు తీసుకుని రామ్‌లాల్ విజయగర్వంతో అక్కడి నుండి కదిలాడు. మిషన్‌గన్ వదిలేశాడు. రెండు రోజుల తరువాత పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

అన్నిటికన్నా చిత్రమైన, అనూహ్యమైన సంఘటన అపుడే జరిగింది

రామ్‌లాల్‌కి ఉరిశిక్ష పడుతుందనుకున్నాం!!!

భారతదేశపు ప్రఖ్యాత క్రిమినల్ లాయర్ - లాయర్ పరమేశ్వరం ఆ కేసును టేకప్ చేశాడు.

పెనుగాలికి ఆకులన్నీ రాలిపోయినా, కొన్ని మిగిలినట్టు మేమూ కొంతమంది సాక్షులం మిగిలాం.

రామ్‌లాల్‌లాటి ఎత్తు పొడవున్న నలుగుర్ని పరమేశ్వరం బోన్‌లో నిలబెట్టాడు. రామ్‌లాల్‌ని నేను గుర్తుపట్టాను. కానీ కంగారులో అటూ ఇటూ పరుగెత్తిన అతిధులు - ఆ నలుగురిలో ఎవరు మిషన్‌గన్ పేల్చారో సరీగ్గా చెప్పలేకపోయారు. లాయర్ పరమేశ్వరం వాగ్ధాటికి వాళ్ళ జ్ఞాపక శక్తిని చిన్నాభిన్నం చేసింది. అతడి ప్రశ్నల బాణాలు వాళ్ళ నమ్మకాన్ని చీల్చి చెండాడాయి. ఆ అయోమయాన్ని ఆ క్రిమినల్ లాయర్ క్యాష్ చేసుకున్నాడు.

మిషన్‌గన్ మీదవున్న వేలిముద్రలు కోర్టులో పరిశీలన కొచ్చాయి. పరమేశ్వరం తనలో తానే ఎందుకు నవ్వుకున్నాడో అప్పుడు నా కర్థం కాలేదు.

మిషన్‌గన్ మీదవున్న వేలిముద్రలు ఆ నలుగురిలో ఏ ఒక్కరివీ కావు!! అప్పుడు తెలిసింది

క్రైమ్ అని.

అంతమందిని చంపి, రక్తాన్ని ఏరులుగా, పారించిన నరరూప రాక్షసుడు న్యాయస్థానంలో 'బెనిఫిట్ ఆఫ్ డవుట్' క్రింద వదిలివేయ బడ్డాడు. రామ్‌లాల్ భుజంమీద ఒక చెయ్యి, పరమేశ్వరం మీద ఒక చెయ్యివేసి కోర్టు హాలునుంచి బయటకు నడుస్తూ అనంతానంతస్వామి మా వైపు విజయగర్వంతో చూసిన చూపు చరిత్రలో ఏ టెర్రరిస్టూ వ్రాయని అదృశ్య రకాల్ని నా గుండెలమీద వ్రాసింది.

నాన్న శాశ్వతంగా కుంటి వాడయ్యాడు. విదేశీయులతో యుద్ధంలో పరమవీరచక్ర సంపాదించిన నాన్న, దేశద్రోహులకి కాళ్ళు అర్పించుకోవలసి వచ్చింది. చదువు, ఆడుకోవటం, జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకోవడం - ఇలాంటి జీవితం, ఆ క్షణంనుంచి మారిపోయింది. నా జీవితంలో ఏకైక శత్రువులుగా అనంతానంతస్వామి, అతడి గ్రూపు మిగిలిపోయారు. అదే ఆఖరి వరకూ నా పోరాటంగా మనసులోనే అనుకున్నాను. డిపార్టుమెంట్‌లో ఆఫీసర్ వరకూ నా పోరాటంగా మనసులోనే అనుకున్నాను. డిపార్టుమెంట్‌లో ఆఫీసర్‌నయ్యాను. కానీ స్వామి శక్తితో పోల్చుకుంటే నా అధికారం ఎంత చిన్నదో, డిపార్టుమెంట్‌లో చేరిన తర్వాత తెలిసింది. నా ఆఫీసులోనే నాకు శత్రువులు. శత్రువులకి తొత్తులు. డబ్బుకి బానిసలు. సమాంతర ప్రభుత్వ నిర్వాహకులకి బానిసలు. 'నేనేం చెయ్యలేను' అనుకునే టైమ్‌లో మీరు పరిచయం ఆయ్యారు. మీ తండ్రెవరోగానీ, ఆయన తెలివితేటలు మీకున్నాయి. వాటికన్నా ముఖ్యంగా 'తెగింపు ' ..... ఒక సైనికుడికుండే తెగింపు, నిర్లక్ష్యం మీలో కనపడ్డాయి. అనంతానంతస్వామిని కనీసం ఈ మాత్రమైనా దెబ్బ తీయగలిగిన మొదటివ్యక్తి మీరే. కానీ ..... కానీ ఈ విధంగా మీరు బయట పడటం నాకు భయంగా వుంది. అతడూరుకోడు. ఏదో ..... చేస్తాడు. ఏదో చేస్తాడు. ....."

అప్పటివరకూ ఆవేదనతో, ఉద్వేగంతో వింటూన్న విహారి ఈ చివరి మాటలకి సన్నగా నవ్వేడు. అతడి మనసంతా ఆమెపట్ల జాలితో నిండిపోయింది. అయినా చివరి మాటలకి నవ్వొచ్చింది.

"ఇదంతా కాస్త ముందుగా నాకు చెప్పి వుండవలసింది ప్రపల్లికా" అన్నాడు

ఆమె కాస్త విస్మయంతో "చెప్తే ఏం జరిగి వుండేది?" అంది.

"ఊబిలోకి కాకుండ లోయలోకి తోసి వుండేవాడిని."

* * *

ఐ.సి. 539 ఎయిర్ బస్ మాద్రాసు నుంచి దూసుకు వస్తోంది. ఎడమవైపు కిటికీ దగ్గర కూర్చుని వున్నాడు లాయర్ పరమేశ్వరం. అతడి చేతిలో పెద్ద బౌండ్ బుక్ వుంది. పైనుంచి తగులుతూన్న చల్లటి గాలికి అతడి వెంట్రుకలు వూగుతున్నాయి. అతడి చేతివేళ్ళు పుస్తకంలోని కాగితాన్ని తిప్పుతున్నాయి.

అతడి కళ్ళజోడు వెనుక గూడు కట్టుకున్న తెలివితేటలు. అతడు నుదుటి గీతల వెనుక

ముఖంలో గెలుపు తెచ్చిన తేజస్సు ---

ఢిల్లీనుంచి తనని అంత అర్జెంట్‌గా స్వామి ఎందుకు పిలిపించాడో అతడికి అర్థంకాలేదు. డైరెక్ట్ ఫ్లయిట్ దొరక్క మద్రాసు వరకూ వెళ్ళి వెనక్కి వస్తున్నాడతను.

అతడికోసం విమానాశ్రయంలో కారు రెడీగా వుంది. వెళ్ళేసరికి స్వామి ఎదురు చూస్తున్నాడు. అది భక్తులకు దర్శనం ఇచ్చే సమయం. అయినా పరమేశ్వరంతో మాట్లాడాలనే ఉద్దేశ్యంతో అంతఃపురంలోనే వుండిపోయాడు. పరమేశ్వరాన్ని చూసి “రా - కూర్చో” అన్నాడు.

* * *

“నా నలభై ఏళ్ళ క్రిమినల్ జీవితంలో ఎందరో గాంగ్ లీడర్లు, ఆయుధాల వ్యాపారస్తులు, సైనికాధికారులు, పోలీసులు నా మీద ఎలాగో ఒకలా కక్ష తీర్చుకోవడానికి రకరకాలుగా ప్రయత్నించారు. యుద్ధాలు చేశారు. చంపాలని ప్రయత్నించారు. జైల్లో పెట్టాలని ప్రయత్నించారు. అందర్నీ ఓడిస్తున్నాను.”

స్వామీ చెబుతూ వుంటే పరమేశ్వరం మౌనంగా వింటున్నాడు.

“నా కెదురుతిరిగిన వాడు నిశ్శబ్దంగా ప్రాణాలు వదిలాడు. నా దారి కడ్డువచ్చినవారు ‘నా’ అనే వారులేక మలమలా మాడిపోయారు. కానీ ..... కానీ ఇన్నాళ్ళకు కుర్రవాడు నాతో సరదాగా ఒక జోకువేశాడు. కార్లో కూర్చొబెట్టి చిటికెన వేలితో దాన్ని లోయలోకి తోశాడు. నేను చావనని అతనికి తెలుసు. రాళ్ళమధ్య ..... నలిగిపోయిన కారులోంచి ..... అతి కష్టంమీద నేను బయటకు వస్తుంటే, రెండు చేతులూ జేబులో పెట్టుకుని లక్ష్యం లేనట్టు నడిచిపోయాడు. ఐ లైక్ హిమ్! మొట్ట మొదటిసారి నా మీద ఒకడు దెబ్బ తీశాడు. అతనిని చంపడం - అతడిని బెదిరించడం - ఇలాటివి నా కిష్టంలేదు. అలాంటి వాడికి రామ్‌లాల్ వున్నాడు. పరమేశ్వరం! నువ్వేం చేస్తావో నాకు తెలీదు - అతడు గిలగిలలాడిపోవాలి. మానసికంగా చిత్రవధలు అనుభవించాలి. నీ క్రిమినల్ బ్రెయిన్ ఉపయోగించి ఆలోచించు. ఒక అనామకుడిగా వున్న నిన్ను దేశంలోకెల్లా పెద్ద లాయర్ని చేశాను. నువ్వు నాకు చేసిన ప్రతి సహాయానికి అకౌంట్లో లక్షలు జమ చేశాను. ఇన్నాళ్ళకి నువ్వు నా మీద నిజమైన కృతజ్ఞత చూపించవలసిన రోజు వచ్చింది. ఇదంతా నీకు ఆశ్చర్యం కలిగిస్తూ వుండవచ్చు పరమేశ్వరం! ఇదేమిటి ఎంతో గంభీరంగా వుండే అనంతానంతస్వామి ఈ రోజు ఇలా మాట్లాడుతున్నాడేమిటా అని! నిజమే ..... కోటిరూపాయల ప్లానుని ఆ కుర్రవాడు విఫలం చేసినప్పుడు కూడా అతడి మీద నాకింత కోపం రాలేదు. కానీ, నా అహాన్ని దెబ్బతీశాడతడు ఇంతకాలం ఎవ్వరూ చెయ్యలేని పనిని అతడు చేశాడు. అంతకి అంతా అతడికి బుద్ధి చెప్పాలి. అందుకే ఢిల్లీనుంచి పిలిపించాను. నీకిందతా నవ్వుగా వుందా?

“లేదు అన్నాడు పరమేశ్వరం ..... నేను అర్థం చేసుకోగలను.”

“గుడ్. నీ పని ఈ రోజునుంచే ప్రారంభించు. ఏంచేస్తావో. ఎలా చేస్తావో నీకే వదిలి పెడుతున్నాను. ఎన్ని రోజులు కావాలి?”

పరమేశ్వరం నవ్వేడు. “ఒక వారం చాలనుకుంటాను. ముందు నేను ఆ కుర్రవాణ్ని

చూడాలి.”

“అదెంతపని? అతడు ఎక్కడో ఒకచోట నాటకాలేస్తూ వుంటాడు” అని ఇంటర్‌కామ్‌లో అడిగాడు.

“ఇంత చిన్న పనికి అంత దూరం నుంచి నిన్ను పిలిపించానంటే ఆ కుర్రాడు ఎలా విలవిలలాడాలని నేను అనుకుంటున్నానో ఊహించగలవు కదా నువ్వు”

“ఈ చెయ్యి వుంది చూశారా? దీనికో గొప్ప గుణం వుంది. ఒక్క సారి షేక్‌హాండిస్తే చాలు - అవతలి మనిషి ఎటువంటి వాడో కనిపెట్టేస్తుంది.”

“ఈ లోపులో ఇంటర్‌కామ్‌లో వార్త వచ్చింది. ఈ సాయంత్రం రవీంద్ర కళాక్షేత్రంలో అతని ప్రోగ్రాం వుందట” స్వామి చెప్పాడు.

“గుడ్ ముందు వరుసలోనే నాకూ ఒక సీటు ఏర్పాటు చేయించండి ” పరమేశ్వరం లేస్తూ అన్నాడు.

“అలాగే”

పరమేశ్వరం చేయి సాచాడు. స్వామి నవ్వుతూ, “వద్దు నీకు షేక్ హాండివ్వడమంత ప్రమాదం మరొకటి లేదని నాకు తెలుసు” అన్నాడు.

పరమేశ్వరం కూడ నవ్వుతూ “వెళ్ళొస్తాను” అన్నాడు.

అతడు వెళ్ళిపోయాక స్వామి బల్లమీద వున్న ఫైల్ తీసుకున్నాడు. దాని అట్టమీద చిన్న అక్షరాలతో ‘విహారి’ అని వ్రాసి వుంది. అతని జీవిత చరిత్ర అంతా ఆ ఫైలులో వుంది.

* * * *

“ఏమిటి మా అబ్బాయి నాటకానికి మీరు కూడా వచ్చారే” అంది వర్దనమ్మ - సునాదమాలనీ, బామ్మనీ చూస్తూ.

అది విహారి నాటకమని తెలియగానే సునాదమాల గుండె ఆగినంత పనయింది. ‘లవకుశ ’ ..... ఆధునిక యక్షగానం అనగానే పట్టుబట్టి బామ్మని తీసుకువచ్చింది. విహారి ట్రూపుది అనుకోలేదు.

“మా అబ్బాయి నాటకాలు నేను చూడను. ఇదిగో ‘లవకుశ’ అన్నాడని వచ్చాను” అంది వర్దనమ్మ.

“నేనూ అంతేనమ్మా! మీ అబ్బాయని తెలీదు. ‘లవకుశ’ అని మా మనవరాల్ని బ్రతిమాలి తోడుగా తీసుకువచ్చాను.”